సాక్షి
విజయనగరం
శనివారం । 1 । మార్చి । 2025



## ముగిసిన స్టెప్‌కాన్ సదస్సు



రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న స్టెప్‌కాన్–2025 జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ స్టెప్‌కాన్ కేవలం సాంకేతిక అంశం మాత్రమే కాదని, దానికి బహుముఖ ప్రాధాన్యం చేకూరిందన్నారు. రానున్న రోజుల్లో టెలీ పోర్టేషన్ సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతిక విప్లవం ద్వారా కొత్త రకాలైన ఉద్యోగావకాశాలు రానున్నాయని, వాటిని పొందాలంటే జ్ఞానం పొందడంతో పాటు నైపుణ్యం సాధనకు ప్రయత్నించాలన్నారు. విద్యార్థులందరికీ విశేషమైన శక్తిసామర్థ్యాలు ఉన్నాయనడానికి రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ సదస్సులోని ప్రదర్శనలే నిదర్శనమన్నారు. దేశం నలుమూలల నుంచి 3,884 మంది విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొని, వివిద అంశాలు ప్రదర్శించారన్నారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విశాఖపట్నం విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన దాసరి సాయిప్రవీణ్‌కు పద్మశ్రీ డాక్టర్ ఎన్.ప్రభాకర్ మెమోరియల్ అవార్డు అందించారు.

## న్యూస్‌రీల్

### రామతీర్థం హుండీల ఆదాయం రూ.49.96 లక్షలు



రామతీర్థంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి వారి హుండీలలో భక్తులు వేసిన కానుకలను దేవస్థానం అధికారులు గురువారం లెక్కించారు. కల్యాణ మండపంలో చేపట్టిన హుండీల లెక్కింపులో రూ.49,96,162 నగదు లభించినట్టు ఈఓ వై.శ్రీనివాసరావు తెలిపారు. 11.800 మిల్లీ గ్రాముల బంగారం, 5 కేజీల 960 గ్రాముల వెండి లభ్యమైందన్నారు. హుండీల లెక్కింపున దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీష పర్యవేక్షించారు. ఆదాయం లెక్కింపులో పలువురు శ్రీవారి భక్తులు, తనిఖీదారు శ్యామ్ ప్రసాద్, దేవస్థాన సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

### నిఘా నీడలో ఇంటర్మీడియట్ పరీక్షలు

- నేటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లాలో 66 కేంద్రాల ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న విద్యార్థులు 41,270 మంది
- వాట్సాప్‌లో హాల్‌టికెట్ల డౌన్‌లోడ్



పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ ఆదినారాయణ

విజయనగరం అర్బన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు వేళయింది. గతనెల 11న ప్రారంభమైన ప్రాక్టికల్ పరీక్షలు 20వ తేదీతో ముగిశాయి. శనివారం నుంచి 20వ తేదీ వరకు నిఘానీడలో థియరీ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో సాధారణ, వృత్తి విద్యాకోర్సులు కలిపి మొత్తం 41,270 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం 20,902 మంది, ద్వితీయ సంవత్సరం 20,368 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికోసం జిల్లాలో మొత్తం 66 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. పరీక్షల ఏర్పాట్లను జిల్లా కన్వీనర్ మజ్జి ఆదినారాయణ, జిల్లా పరీక్షల కమిటీ (డీఈసీ) సభ్యులు పరిశీలించారు. పరీక్షలకు 900 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. ముగ్గురు ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఆరుగురు సిట్టింగ్ స్క్వాడ్స్, డిస్ట్రిక్ట్ ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ప్రతిరోజూ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షిస్తారు. పరీక్ష కేంద్రానికి 8.30 గంటలకే చేరుకోవాల్సి ఉంటుంది. విద్యార్థుల హాల్‌టికెట్లను 95523 00009 అనే వాట్సాప్ నంబర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రిన్సిపాల్ సంతకం లేకుండానే హాల్‌టికెట్ తీసుకుని నేరుగా పరీక్ష కేంద్రాలకు వెళ్లొచ్చు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లుకు తావివ్వొద్దని పరీక్షల జిల్లా కన్వీనర్ మజ్జి ఆదినారాయణ చీఫ్ సూరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో సూచించారు. పరీక్షల పరిశీలన సిబ్బంది సెల్‌ఫోన్లు వినియోగించరాదన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా జిల్లా కేంద్రంలోని ఆర్ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఫోన్: 08922-237988కు తెలియజేయాలన్నారు.


### నేటి నుంచి కొత్త మెనూ

విజయనగరం అర్బన్: మధ్యాహ్న భోజన పథకానికి ఇంతవరకు వండుతున్న వంటకాలను మార్చుతూ కొత్త మెనూను విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. కొత్తగా ప్రకటించిన మెనూ శనివారం నుంచి అమల్లోకి వస్తున్నట్లు డీఈఓ యు.మాణిక్యంనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్త మెనూ ఇలా..

| రోజు | వండాల్సిన వంటకం |
|---|---|
| సోమవారం | అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి |
| మంగళవారం | అన్నం, గుడ్డు కూర, రసం, రాగిజావ |
| బుధవారం | వెజ్ పలావ్, ఆలూకుర్మా, ఉడికించిన గుడ్డు, చిక్కి |
| గురువారం | అన్నం, సాంబార్, గుడ్డుకూర, రాగిజావ |
| శుక్రవారం | చింతపండు రైస్ (పులిహోర), చట్నీ (గోంగూర/కూరగాయలు), ఉడికించిన గుడ్డు, చిక్కి |
| శనివారం | అన్నం, కూరగాయల కూర, రసం, రాగిజావ, స్వీట్ పొంగలి |

# బడ్జెట్ సాక్షిగా.. బాబు మోసం




- కూటమి ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌పై సర్వత్రా విమర్శలు
- సూపర్ సిక్స్ అమలుపై కరిగిపోయిన సామాన్యుల ఆశలు
- 2025–26 పూర్తిస్థాయి బడ్జెట్‌లో కనిపించని సంక్షేమ పథకాలు
- ప్రస్తావించిన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలపైనా సందేహాలు
- అమలయ్యేవరకూ చెప్పలేమంటున్న ప్రజానీకం
- అన్నీ కంటితుడుపు కేటాయింపులేనని పెదవి విరుపు

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

టీడీపీ, జనసేన, బీజేపీ కలగలిపిన కూటమి ప్రభుత్వం మాది.. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారం తమదే.. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటూ టీడీపీ, జనసేన నాయకులు చెప్పుకొనే గొప్పలు చూస్తే అబ్బో అనిపిస్తాయి! తీరా రాష్ట్ర బడ్జెట్ చూస్తే మాత్రం అంతా అంకెల గారడీనే కనిపిస్తుందని విపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వైఎస్సార్‌సీపీ అమలుచేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని, అంతకుమించి సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తామని గత సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ, జనసేన నాయకులు అరచేతిలో వైకుంఠం చూపించారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలకు ఎగనామం పెట్టేశారు. రానున్న సంవత్సరం కూడా సూపర్ సిక్స్ పథకాలు అందవన్న విషయం శుక్రవారం నాటి రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు చూసిన తర్వాత స్పష్టమైంది. సామాన్యుల ఆశలు కరిగిపోయాయి. గత ఏడాది నవంబర్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లోనే అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలను ప్రస్తావించినా తర్వాత వాటి ఊసే లేదు. వాటినే మళ్లీ తాజా పూర్తిస్థాయి బడ్జెట్ 2025–26లోనూ ప్రతిపాదించినా అరకొర నిధులే కేటాయించడంతో అవెంత వరకూ అమలుచేస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సూపర్ సిక్స్‌లోని మిగతా సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలేవీ లేవు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌పై ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

### రైతులకు సాయం అందేనా?


పెట్టుబడి సాయం కింది ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ.20 వేల చొప్పున అందిస్తామనేది టీడీపీ, జనసేన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ. గత తాత్కాలిక బడ్జెట్‌లోనే ఇస్తామని ప్రతిపాదించినా ఒక్క పైసా కూడా రైతులకు ఇవ్వలేదు. ఈసారి బడ్జెట్‌లో రాష్ట్రంలో 53.5 లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద దఫదఫాలుగా సాయం అందించేందుకు రూ.6,300 కోట్లు ప్రతిపాదించారు. అమలయ్యేవరకూ అనుమానమే. రైతుసేవా కేంద్రాలుగా పేరుమార్చిన రాష్ట్రంలోని 10778 ఆర్‌బీకేలకు నిర్వహణ ఖర్చుల కింద కేవలం రూ.19.42 కోట్లు మాత్రమే



ప్రతిపాదించారంటే... వాటిని మరింత నిర్వీర్యం చేయడానికేనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయాధారిత విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇవెంతగానే ఉపయోగపడిన విషయం తెలిసిందే. మార్కెట్లలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పడిపోతే కొనుగోలు చేసి రైతులను ఆదుకొనేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమా రు రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసింది. కానీ కూటమి ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కేవలం రూ.300 కోట్లు మాత్రమే ప్రతిపాదించింది.

### సాగునీటి పథకాలకు అరకొరగా నిధులు...

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి విజయనగరం జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా తలపెట్టిన సాగునీటి ప్రాజెక్టు పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఆయన కుమారుడు, గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయిస్తూ వచ్చారు. అదే పంథాను కొనసాగించడంలో కూటమి ప్రభుత్వం పెద్దగా ఆసక్తి చూపించలేదని ఈ బడ్జెట్‌ను చూస్తే తేటతెల్లమవుతోంది. కాలువల నిర్మాణానికి సంబంధించి జంఝావతి, తోటపల్లి కొత్త ఆయకట్టు తో కలిపి వెంగళరాయసాగర్ విస్తరణకు అవసరమైన 21 ఎకరాల భూసేకరణకు, తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు మిగులు పనులకు, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు గజపతినగరం బ్రాంచ్ కెనాల్‌కు అవసరమైన 240 ఎకరాల భూసేకరణకు, పాత తోటపల్లి బ్యారేజ్ ఆధునికీకరణ, పెద్దేరు రిజర్వాయరు, మడ్డువలస రిజర్వాయరు మిగులు పనులన్నింటికీ కలిపి కేవలం రూ.54.73 కోట్లు మాత్రమే ప్రతిపాదించడమే దీనికి నిదర్శనం. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు రూ.605.75 కోట్లు, తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టుకు రూ.47.80 కోట్లు ప్రతిపాదించారు. మిగులు పనులు, నిర్వాసితులకు పరిహారం చెల్లింపునకు కలిపి తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టుకు రూ.68 కోట్లు కేటాయించారు.



### అరకొరగా కేటాయింపులు...

- భోగాపురం ఎయిర్‌పోర్టు అనుసంధాన రహదారి నిర్మాణానికి ఇంకా 40 ఎకరాల భూసేకరణకు సంబంధించి రూ.195 కోట్లు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు.
- పార్వతీపురం మన్యం జిల్లా సహా రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో నెలకొన్న ఏనుగుల సమస్యను పరిష్కరించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు ఎలిఫెంట్‌కు కేవలం రూ.1.28 కోట్లే కేటాయించారు.
- విజయనగరంలోని జేఎన్‌టీయూ–గురజాడ ఇంజనీరింగ్ విశ్వవిద్యాలయంలో మౌలిక వసతుల కల్పనకు సాయంగా సుమారు రూ.5.60 కోట్లు ప్రతిపాదించారు. దీంతో పాటు కురుపాంలోని గిరిజన ఇంజనీరింగ్ కళాశాలకు కలిపి భవనాలు, ల్యాబ్‌ల నిర్మాణం కోసం మరో రూ.3.40 కోట్లు కేటాయించారు.
- విజయనగరం శివారులోని కోరుకొండ సైనిక్‌స్కూల్‌తో పాటు కలికిరి సైనిక్‌స్కూల్‌కు కలిపి అదనపు నిర్మాణాల కోసం రూ.2 కోట్లు ప్రతిపాదించారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజన ప్రాంతాలైన సీతంపేట, పార్వతీపురంతో పాటు మరో మూడు ప్రాంతాల్లో నిర్మించతలపెట్టిన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులకు రూ.110 కోట్లు ప్రతిపాదించారు.
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిన విజయనగరం సహా రాష్ట్రంలోని మరో ఆరు బోధనాసుపత్రులకు కలిపి రూ.375 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. అరకొర నిధులతో విజయనగరం మెడికల్ కాలేజీలో రెండో దశ నిర్మాణాలు వేగవంతమయ్యే అవకాశం కనిపించట్లేదు.

### కూటమి ప్రభుత్వం తీరని అన్యాయం...



మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమ బడ్జెట్ అంటే ఏమిటో అమలుచేసి చూపించింది. ప్రపంచాన్నే వణికించిన కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలోనూ సంక్షేమ పథకాలను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగించారు. అంతకన్నా ఎక్కువగా సంక్షేమ పథకాలు ఇస్తామని, సూపర్ సిక్స్ అని ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన మూడు పార్టీల కూటమి ప్రభుత్వం... బడ్జెట్‌లో మొండిచేయి చూపిస్తోంది. అన్నివిధాలా వెనుకబడిన ఉమ్మడి విజయనగరం జిల్లాకు సంబంధించి ప్రత్యేక కేటాయింపులు లేవు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం ఇస్తామంటున్నారు కానీ అమలయ్యేవరకూ అనుమానమే. పింఛన్లు కూడా భారీగా కోత పెట్టే ఆలోచనలే కనిపిస్తున్నాయి.
– మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్

### ఆ పథకాలు ఈ ఏడాది లేనట్లే!



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలనెలా రూ.1500 సాయం, నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు భృతి, 50 ఏళ్లకే బీసీలకు పింఛన్లు... పథకాలేవీ వచ్చే సంవత్సరం కూడా లేనట్లేనని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదనలు చూస్తే తెలుస్తోంది. తల్లికి వందనం పథకానికి కూడా కేవలం రూ.9407 కోట్లు మాత్రమే కేటాయించారంటే అదీ అనుమానమే. ఎంతమంది అర్హులుంటే అంతమందికీ ఇవ్వాలంటే దాదాపు రూ.20వేల కోట్లు అవసరమవుతాయి. గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమ్మ ఒడి పథకానికి 2019–20 బడ్జెట్‌లోనే రూ.19618 కోట్లు కేటాయించారు. దీన్నిబట్టి చూస్తే తల్లికి వందనం పథకం కూడా అమలయ్యేవరకూ చెప్పలేని పరిస్థితి. – డాక్టర్ శోభా స్వాతిరాణి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్

### హామీలకు... బడ్జెట్‌కు పొంతన ఉందా?



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలకు.. రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులకు పొంతన లేదు. తల్లికి వందనం కోసం రూ.12,450 కోట్లు అవసరమైతే కేవలం రూ.8,778 కోట్లు మాత్రమే కేటాయించడం దారుణం. ఆడబిడ్డ పథకానికి కేటాయింపులే లేవు. అన్నదాత సుఖీభవ పథకానికీ అరకొర నిధులే. లబ్ధిదారులు అప్రమత్తంగా ఉండాలి. బడ్జెట్ సాక్షిగా ప్రజలను మరోసారి మోసం చేశారు.
– శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి

### సహకార రంగంపై చిన్నచూపు



2025–26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో సహకార సంఘాల బలోపేతం, సహకార చక్కెర ఫ్యాక్టరీల ఆధునికీకరణ, మార్కెట్ యార్డుల అభివృద్ధిని పట్టించుకోలేదు. కీలకమైన విద్యరంగానికి కేవలం 11శాతం, ఆరోగ్యం కోసం 6 శాతం, వ్యవసాయానికి 4 శాతం, గ్రామీణ పంచాయతీ రాజ్ అభివృద్ధికి 6 శాతం, ఇరిగేషన్‌కు కేవలం 5శాతం మాత్రమే కేటాయింపులు చేయడం అన్యాయం.
– భీశెట్టి బాబ్జి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

### మాయల బడ్జెట్



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగించేందుకే తిప్పలు పడుతున్న చంద్రబాబు ప్రభుత్వం మాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మరి అలవికాని హామీలను ఇచ్చి, అందులోనూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు వాటిని అటకెక్కించినట్టేనా? నిరుద్యోగ భృతి ఏమైంది? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమైంది.? వీటికి సమాధానం చెప్పాలి. – బొద్దల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి, బొబ్బిలి

### కంటితుడుపుగానే...



సగానికి పైబడిన జనాభాకు ఆధారంగా ఉన్న వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు కంటి తుడుపుగానే ఉన్నాయి. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వంశధార, తోటపల్లి, నారాయణపురం ప్రాజెక్టుల ఆధునికీకరణకు కావాల్సిన నిధులు కేటాయించలేదు. పశువైద్య విద్యార్థులు గత 25 రోజులుగా సమ్మె చేస్తున్నా సమస్యకు పరిష్కారం చూపలేదు. ఉత్తరాంధ్రకు మొండిచేయి చూపింది.
– బుడితి అప్పలనాయుడు, కార్యదర్శి, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం

### కార్మిక వ్యతిరేక బడ్జెట్



కూటమి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఆప్కాస్ ఉద్యోగుల ఆశలపై నీళ్లుజల్లింది. మున్సిపల్ ఇంజినీరింగ్, వాటర్ సప్లై, స్ట్రీట్ లైట్లు, వాల్ ఆపరేటర్లు, పార్కుల్లో పనిచేసే కార్మికుల కోసం బడ్జెట్లో ఎలాంటి కేటాయింపులు చేయకుండా ద్రోహం చేసింది. ఆందోళనకు సిద్ధం కావాలి. – ఎ.జగన్‌మోహన్‌రావు, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ సభ్యుడు )

### గారడీ బడ్జెట్



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ అంతా గారడీగానే కనిపిస్తోంది. అమరావతి చుట్టు పక్కల అభివృద్ధికే పరిమితమైంది. రాష్ట్రాభివృద్ధిని పక్కనపెట్టింది. పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. నిరుద్యోగులకు మొండిచేయి చూపింది. విద్య, వైద్య రంగాలకు కొత్త కేటాయింపులు లేకపోవడం దారుణం.
– డాక్టర తలే రాజేష్, వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి

### మంత్రులు సిగ్గుపడాలి



బడ్జెట్ బాగుందంటూ ప్రశంసలు గుప్పించిన మంత్రులు సిగ్గుపడాలి. బడ్జెట్ అంతా అంకెల గారడీలా ఉంది. ద్రవ్యలోటు రూ.68,742,65 కోట్లుగా, రెవెన్యూ లోటు రూ.34,712,84 కోట్లుగా చూపారు. ఈ లోటును ఏ రకంగా భర్తీచేస్తారో చెప్పలేదు. నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణ ఊసేలేదు. విద్యారంగానికి బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాలన్న కొఠారి కమిషన్ నివేదికను కనీసం పట్టించుకోలేదు. కౌలు రైతులు, నిరుద్యోగుల కోసం కనీసం ప్రస్తావన లేదు.
– బుగత అశోక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి

### పీఆర్‌సీ అమలుకు కేటాయింపులేవీ?



రాష్ట్ర బడ్జెట్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గానికి అన్యాయం జరిగింది. ఇప్పటికే 20 నెలలు ఆలస్యమైన 12వ పీఆర్‌సీ ప్రస్తావనలేదు. ఐఆర్ అమలు కోసం నిధుల కేటాయింపుపై స్పష్టత ఇవ్వలేదు. సీపీఎస్/జీపీఎస్ కన్నా మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీపై బడ్జెట్లో ఎటువంటి ప్రకటన లేదు. పాఠశాల విద్యకు గత ప్రభుత్వం చివరి బడ్జెట్‌లో 10.15 శాతం నిధులు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం 9.86 శాతం మాత్రమే కేటాయించారు.
– డి.శ్యామ్, రాష్ట్రకార్యదర్శి, ఎస్టీయూ

### నిరాశాజనకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉద్యోగవర్గాలకు నిరాశను మిగిల్చింది. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం, ఐఆర్ ప్రస్తావన లేక పోవడం బాధాకరం.
– కె.చంద్రరావు, ఎస్టీటీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గజపతినగరం

# అమ్మ జాతరకు సర్వంసిద్ధం



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం



శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు

- రేపటినుంచి శ్రీ కనకమహాలక్ష్మి జాతర
- మూడు రోజుల జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

చీపురుపల్లి: విజయనగరం జిల్లాతో పాటు శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లో ఉండే భక్తులు మాత్రమే కాకుండా ఒడిశా వంటి సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర రానే వచ్చింది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి, ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. మార్చి 2, 3, 4 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించేందుకు దేవాదాయశాఖ నిర్ణయించింది.



దేవస్థానంలో ఏర్పాటు చేసిన క్యూలు

### ఏర్పాట్లు పూర్తి

మార్చి 2, 3, 4 తేదీల్లో జరగనున్న శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం పూర్తి ఏర్పాట్లు చేశాం. ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాం. రూ.100, రూ.50, రూ.20, రూ.10తో పాటు ఉచిత దర్శనం కూడా భక్తులకు కల్పిస్తున్నాం. – బి.శ్రీనివాస్, ఈఓ, దేవదాయశాఖ, చీపురుపల్లి

# బొబ్బిలిలో హమాలీల ఆందోళన

- ఏళ్లతరబడి పనిచేస్తున్నవారిని పక్కన పెట్టడంపై మండిపాటు
- సివిల్ సప్లయి బియ్యం లోడ్‌లను అడ్డుకున్న కూలీలు
- బొబ్బిలి రైల్వే స్టేషన్‌వేగన్ పాయింట్ వద్ద ధర్నా



గ్రోత్ సెంటర్ వద్ద లారీలు నిలుపుదల చేసి నినదిస్తున్న హమాలీలు

బొబ్బిలి: 'గత 40 సంవత్సరాలుగా బొబ్బిలి రైల్వే స్టేషన్‌లోని వ్యాగన్‌పాయింట్ వద్ద హమాలీలుగా పనిచేస్తున్నాం. ఏటా హమాలీల అగ్రిమెంట్ ఒప్పందాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కూడా అగ్రిమెంట్ డిసెంబర్ వరకూ ఉంది. అగ్రిమెంట్‌ను కాదని ఇక్కడ హమాలీలకు చెల్లిస్తున్న కూలిరేట్ల కంటే తక్కువ కూలికి వచ్చేవారిని నియమించుకునేందుకు ప్రయత్నించడం దుర్మార్గం' అంటూ హమాలీలు ఆందోళన చేశారు. పట్టణ కళాశీ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బోగాది అప్పలస్వామి, దంతులూరి వర్మ సమక్షంలో కాంట్రాక్టర్లను నిలదీశారు.

**ఇదీ సమస్య...**

ఇతర రాష్ట్రాలకు బియ్యం తరలించేందుకు బొబ్బిలి రైల్వే స్టేషన్‌లో వ్యాగన్ పాయింట్ నాలుగు దశాబ్దాలుగా నడుస్తోంది. ఇక్కడ పలు గ్రామాలకు చెందిన హమాలీలు పనిచేస్తున్నారు. ఇటీవల విశాఖ–రాయపూర్‌ల మధ్య నిర్మిస్తున్న మూడో రైల్వే లైన్ నిర్మాణంతో పాటు రైల్వేస్టేషన్‌లోని పలు భవనాల పనుల కారణంగా రైల్వే వ్యాగన్ పాయింట్‌ను కోమటిపల్లి స్టేషన్‌కు తరలించారు. అక్కడకు వెళ్లిన హమాలీలను కొత్తగా అక్కడ నియమితులైన కార్మికులు అడ్డుకున్నారు. ఏళ్లతరబడి ఇదే పనిగా బతుకుతున్నామని, పనికి రావద్దంటే ఎలా అన్ని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించకపోవడంతో శుక్రవారం ధర్నాకు దిగారు. బొబ్బిలి పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఉన్న వ్యాగన్‌పాయింట్ నుంచి కోమటిపల్లిలో లోడింగ్‌కోసం వెళ్తున్న సివిల్ సప్లయి లారీలను గ్రోత్ సెంటర్ వద్ద అడ్డుకున్నారు. లారీలన్నింటినీ గ్రోత్‌సెంటర్‌లోని అంతర్గత రోడ్లలోకి మళ్లించి అడ్డంగా నిలబడ్డారు. న్యాయం జరిగే వరకూ పోరాడుతామంటూ నినదించారు. విషయం తెలుసుకున్న బొబ్బిలి సీఐ కె.సతీష్‌కుమార్, ఎస్ఐలు ఆర్.రమేష్, పి.జ్ఞానప్రసాద్, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పౌరసరఫరాల శాఖ సాంకేతిక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని హమాలీలకు నచ్చజెప్పే ప్రయత్నంచేసినా వినలేదు. సంఘ నాయకులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. వచ్చే రైల్వే వ్యాగన్ లోడింగ్ పనిలో గతంలో పనిచేసిన హమాలీలే పనిచేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇవ్వడం, కాంట్రాక్టర్‌తో ఒప్పందపత్రం రాయించడంతో ఆందోళన విరమించి లారీలను విడిచిపెట్టారు. ఆందోళనలో పీడీఎస్ఓ నాయకులు సోమేశ్వరరావు, పిరిడి అప్పారావు, యరబాల అప్పారావు, పైల రామకృష్ణ, పౌరసరఫరాల సంస్థ టెక్నీషియన్ హరిశంకర్, కాంట్రాక్టర్లు అప్పారావు, బుల్లిరాజు, లారీ ఓనర్ల సంఘం బొబ్బిలి అధ్యక్షుడు నంబియార్‌వేణుగోపాలరావు, కాకల వెంకటరావు, పిరిడి ఈశ్వరరావు పాల్గొన్నారు.